సాక్షి
వరంగల్
ఆదివారం । 3 । మార్చి । 2024

భీమా సందడి

గోపీచంద్ హీరోగా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం భీమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం రాత్రి వరంగల్ నగరంలోని కేడీసీ మైదానంలో జరిగింది. ఈ సినిమాలో హీరోయిన్లు ప్రియాభవానీ శంకర్, మాళవిక శర్మ, ఇతర పాత్రల్లో నాజర్, నరేష్ నటించారు. హీరోహీరోయిన్లు గోపీచంద్, మాళవిక శర్మను చూసి అభిమానులు కేరింతలు కొట్టారు.

- 8లో▸



న్యూస్‌రీల్

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



రాయపర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కాంగ్రెస్ బలోపేతం కోసం కార్యకర్తలు కృషిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి కోరారు. మండల కేంద్రానికి చెందిన వర్ధన్నపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మచ్చ లక్ష్మీనారాయణ బీఆర్ఎస్ నుంచి శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు లక్ష్మీనారాయణను పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందుకు కార్యకర్తల సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ఎనగందుల మురళి, మచ్చ నీలయ్య, గ్రామ అధ్యక్షుడు మచ్చ రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం



వర్ధన్నపేట : వర్ధన్నపేట పురపాలక సంఘం సమావేశం శనివారం కార్యాలయంలో నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే సమక్షంలో జూనియర్ అకౌంటెంట్ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. ఆస్తిపన్ను రూ.98.67 లక్షలు, అద్దెల ద్వారా ఆదాయం రూ.4 లక్షలు, ప్రజారోగ్యం, పారిశుధ్యం రూ.10.50 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం రూ.17.50 లక్షలు, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు, రుణాలు రూ.3.50 లక్షలు చూపారు. అదేవిధంగా వ్యయాన్ని కూడా చదివి వినిపించారు. చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కమిషనర్ జోనా, వైస్‌చైర్మన్ కోమండ్ల ఎలేందర్‌రెడ్డి, డీఈ శ్రీనాథ్, వార్డు కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఏఈ అనిల్, టౌన్‌ప్లానింగ్ అధికారి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో శ్రీపాదరావు జయంతి వేడుకలు



కరీమాబాద్ : కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి అదనపు కలెక్టర్ సంధ్యారాణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎలక్షన్ సూపర్‌వైజర్ విశ్వనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

చెన్నారావుపేట : మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్ సూచించారు. మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు హైమ అధ్యక్షతన శనివారం లకుపతి దీదీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రాజెక్టులో పనిచేస్తున్న ప్రతికార్యకర్త కృషిచేయాలన్నారు. ఏపీఎం ఈశ్వర్, ఎర్రబెల్లి వేణు, సీసీలు కట్టయ్య, మంజుల, సుజాత, శ్రీలత, సిబ్బంది పుష్పాల రజిత, ఉమ, వీఓఏలు సుధ, మంజుల, అస్మా, జ్యోతి, మహేందర్, రమేష్, ఐలయ్య పాల్గొన్నారు.

కొండాపురం చెరువులో దయ్యపు చేప!



రాయపర్తి : మండలంలోని కొండాపురం గ్రామ చెరువులో మత్స్యకారుల వలకు శనివారం దయ్యపు చేప చిక్కింది. దీనిని మత్స్యకారులు వింతగా చూశారు. చేపలను తింటుందని యూట్యూబ్‌లో వచ్చిందని తెలిపారు. సముద్రం, నదుల్లో ఉండే ఈ చేప చెరువులోకి వచ్చిందేంటని అవాక్కయ్యారు. ఈ చేప తినడానికి పని చేయదని, చెరువుల్లోకి వచ్చిందంటే చేపలను తింటుందని పేర్కొన్నారు. వీటిని సంకర్ మౌత్ క్యాట్‌ఫిష్ అని కూడా అంటారని వారు చెప్పారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం రెవెన్యూ, ఇరిగేషన్, రైల్వే, జాతీయ రహదారుల అధికారులతో భూసేకరణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్–163 వరంగల్ నుంచి ఖమ్మం, కాజీపేట మీదుగా విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ భూసేకరణ పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. పనుల పురోగతిపై వారంలోగా మళ్లీ సమీక్షించనున్నట్లు తెలిపారు.అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, కుడా ప్రాజెక్టు అధికారి అజిత్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు సాల్మన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో వైద్య కళాశాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో వైద్య కళాశాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. నర్సంపేటలో చేపట్టిన 250 పడకల ఆస్పత్రి పనుల పురోగతి, తాత్కాలికంగా వైద్య కళాశాల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మిగిలిన ఫర్నిషింగ్ పనులు వేగవంతంగా పూర్తిచేసి, వైద్య కళాశాల తరగతులు, ఆస్పత్రిని ఏప్రిల్‌లో ప్రారంభించేలా చూడాలన్నారు. ఆస్పత్రిలోని మూడు బ్లాక్‌ల్లో ఒక బ్లాక్ వైద్య కళాశాలకు, రెండు బ్లాక్‌లతోపాటు నర్సంపేట ఏరియా ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రికి వినియోగించాలని సూచించారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషన్, అధికారులు పాల్గొన్నారు.



భూసేకరణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

11న జేఎల్ఎం నియామకాలకు పోల్ టెస్ట్

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ పూర్వ వరంగల్ జిల్లా స్థాయిలో మిగిలిపోయిన జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి ఈనెల 11న పోల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు హనుమకొండ ఇన్‌చార్జ్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఇటీవల వరుసగా రెండు పర్యాయాలు పోల్ టెస్ట్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా 25 పోస్టులు మిగిలిపోయాయి. ఈపోస్టుల భర్తీకి ఈనెల 11న ఉదయం 9న హనుమకొండ పెద్దమ్మగడ్డలోని విద్యుత్ ఉద్యోగుల శిక్షణ కేంద్రం (ఎస్పీటీఐ)లో పోల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపినట్లు తెలిపారు. జాబితాను హనుమకొండ సర్కిల్ కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు వివరించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

క్లిక్ చేస్తే ఖల్లాస్!

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్ల పంజా

- రెండు నెలల్లో 753 మంది బాధితులు
- ఏ చిన్న అవకాశాన్ని వదులుకోని కేటుగాళ్లు
- అవగాహనతోనే.. నేరాలను అరికట్టవచ్చంటున్న అధికారులు



కమిషనరేట్ పరిధిలో కేసులు ఇలా..

సంవత్సరం	ఫిర్యాదులు	కేసులు	పరిష్కారం	దర్యాప్తులో ఉన్నవి
2023	3,524	1,108	1,738	604
2024 (ఫిబ్రవరి వరకు)	753	91	614	43

(ఈ కేసుల వివరాలు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తీసుకున్నవి)
(పోర్టల్‌లో నమోదై ఎఫ్ఐఆర్ చేయించుకోవడానికి ఇష్టపడని కేసులు పరిష్కారం కింద లెక్కిస్తారు)

- వరంగల్ నగరంలో ఆయన ఓ డాక్టర్. అతడిపై సైబర్ నేరగాళ్లు పెట్టుబడి అనే ఆయుధం వాడారు. దానికి డాక్టర్ స్పందించాడు. ఒకటి కాదు రెండు రూ.70 లక్షలు పెట్టుబడి పెట్టాడు. చివరికి అది మోసం అని తెలుసుకుని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.
- హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి పెళ్లి కోసం మ్యాట్రిమోనిలో వెతికాడు. ఓ అమ్మాయి పరిచయమైంది. మాటామాట కలిసింది. 'నేను క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టా. లక్షల రూపాయల లాభం వచ్చింది' అని తీయని మాటలతో నమ్మబలికింది. దీంతో అతను సొంత డబ్బులు లేకున్నా బ్యాంకు రుణం తీసుకుని ఆ అమ్మాయి చెప్పినట్లు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టాడు. చివరకు రూ.50 లక్షలు పెట్టుబడి పెడితే తప్ప మోసపోయినట్లు గుర్తించలేదు.
- కాజీపేటకు చెందిన బిల్డర్ బెంగళూరులో కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లో ఉన్నాడు. 'ఆన్‌లైన్‌లో పెట్టుబడి, రాబడి డబుల్' అనే సరికి నమ్మాడు. ఇంకేముంది రూ.50 లక్షలు పెట్టాడు. చివరికి అదంతా మోసం అని తెలిసి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

.. ఇలా చాలామంది ఉన్నత చదువులు, పెద్దస్థాయిలో ఉన్న వారు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుతున్నారు. వారు పెట్టే పెట్టుబడులను కనీసం ఇంట్లో వారికి కూడా చెప్పలేని పరిస్థితి. మోసపోయామని సమాజంలో తెలిస్తే పరువుపోతుందని భయపడి కూడా కొంతమంది పోలీసులను కూడా ఆశ్రయించడం లేదు.

వరంగల్ క్రైం:

సులభంగా డబ్బులు సంపాదించాలి.. చిన్న పెట్టుబడి.. పెద్ద లాభం....ఇలాంటి ఆలోచనలు ఉన్న వ్యక్తులు సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో చిక్కుకుని సర్వస్వం కోల్పోతున్నారు. తియ్యటి మాటలతో మభ్య పెట్టడం.. కొత్త నంబర్ల నుంచి ఆఫర్లు, స్క్రాచ్‌కార్డులు అంటూ పంపుతున్న ఆన్‌లైన్ లింక్‌లను మనం ఓపెన్ చేయడం.. ఆ తర్వాత అకౌంట్‌లోని డబ్బులు మాయం కావడం.. లబోదిబోమంటూ సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయడం.. ఇలాంటి ఘటనలు రోజూ చూస్తున్నాం. సైబర్ నేరగాళ్ల ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో వస్తుంది..? దానికి ఎంత మంది బలవుతారో అనే అంశంపై సైబర్ నిపుణులు సైతం ఊహించలేకపోతున్నారు. మోసం జరిగే వరకు దాని రూపం తెలియని పరిస్థితులు ఉన్నాయి. పెద్ద పెద్ద చదువులు చదివిన వారినుంచి అమాయకుల వరకు ఈ మోసగాళ్ల బారిన పడి లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు.

ఈ రాష్ట్రాల్లోనే మూలాలు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న సైబర్ నేరగాళ్ల మూలాలు రాజస్థాన్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ కొన్ని మారుమూల ప్రాంతాల్లోనూ హై స్పీడ్ ఇంటర్ నెట్ ఉంటుంది. వారంతా ఇది ఒక ఉద్యోగంలా చేస్తున్నట్లు వెల్లడైంది. ఝార్ఖండ్‌లోని జామ్‌తార, ఉత్తర ప్రదేశ్‌లో భరత్‌పూర ప్రాంతాలు సైబర్ మోసాలకు ల్యాండ్ మార్క్‌గా ఉన్నట్లు బయటపడింది.

కమిషనరేట్‌లో సైబర్ స్టేషన్..

రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు స్థానికంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (సీసీపీఎస్) ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అనుమతులు రావాల్సి ఉంది. ఏసీపీ స్థాయి అధికారి ఎస్‌హెచ్ఓగా ఉంటారు. దీంతోపాటు అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాలపై అవగాహన ఉండేందుకు ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లకు సైబర్ వారియర్‌గా శిక్షణ ఇచ్చారు.

ఒక్కో పేరుతో మోసమిలా..

సైబర్ నేరగాళ్లు పలురకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారు. ఉద్యోగాలున్నాయని, పెట్టుబడి పేరిట, ఓఎల్ఎక్స్, కొరియర్, ఓటీపీ, ఏటీఎం, డెబిట్ కార్డులు, కరెంటు బిల్లులు, బిట్ కాయిన్స్, అయోధ్య జన్మభూమి ఆలయ దర్శన టికెట్లు ఇలా రకరకాల పేర్లు పెట్టి ప్రజలకు ఏ అంశంపై ఆసక్తి ఎక్కువగా ఉంటుందో వాటిని టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన ఫిర్యాదుల్లో ఈ అంశాలే ఎక్కువగా ఉండడం గమనార్హం. సోషల్ మీడియాలో అందుబాటులో ఉండే సమాచారంతో సైబర్ నేరగాళ్లు ఓ అడుగు ముందుకేసి అమ్మాయిలను ముందు పెట్టి ఉన్నతాధికారులను హనీట్రాప్ చేసిన ఘటనలున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొందరు ఈ హనీట్రాప్ బారిన పడడం గమనార్హం. వీరు ఎవరికీ చెప్పుకోలేక.. అడిగినంత డబ్బు ఇచ్చేసి మిన్నకుండిపోయారు.

అవగాహనతోనే నేరాల అంతం..



సైబర్ నేరాలను కేవలం అవగాహనతోనే అంతం చేయొచ్చు. సోషల్ మీడియా వేదికగా పరిచయం లేని వ్యక్తులు పంపే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. ఆన్‌లైన్‌లో పరిచయం లేని వ్యక్తులతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించొద్దు. బ్యాంకు అకౌంట్‌ల వివరాలు, పిన్ నంబర్లు, ఓటీపీలు, ఆధార్ వివరాలు ఇతరులతో పంచుకోకూడదు. సోషల్ మీడియా అకౌంట్లలో సెట్టింగ్ ప్రైవసీ పెట్టుకోవాలి. కస్టమర్ సెంటర్ల పేరిట ఎవరూ ఫోన్ చేయరు. దీనిని అందరూ గుర్తు పెట్టుకోవాలి. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 టోల్‌ఫ్రీకి కాల్ చేయాలి. www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. అప్పుడు మాత్రమే పోగొట్టుకున్న సొత్తును రికవరీ చేయడానికి అవకాశం ఉంటుంది.

– కూజ విజయ్‌కుమార్, సైబర్ క్రైం ఏసీపీ

నేడు పల్స్‌పోలియో

- జిల్లాలో 75,277 మంది ఐదేళ్లలోపు చిన్నారులు
- చుక్కల మందు వేయడానికి 456 బూత్‌లు



గీసుకొండ : పోలియో రహిత సమాజం కోసం ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ తెలిపారు. 14 పీహెచ్‌సీలు, 118 హెల్త్ సబ్‌సెంటర్ల పరిధిలో 456 బూత్‌లను ఏర్పాటు చేశారు. మొదటిరోజు ప్రతి బూత్‌లో 0–5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. 4, 5 తేదీల్లో మొదటి రోజు వేయగా మిగిలిన పిల్లలకు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటా తిరిగి చుక్కల మందు వేస్తారు. మొత్తం 2,15,662 కుటుంబాలు జిల్లాలో ఉండగా.. ఐదేళ్లలోపు చిన్నారులు 75,277 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికి వంద శాతం చుక్కల మందు వేయించేందుకు 46 మంది సూపర్‌వైజర్లు, 1,824 మంది వ్యాక్సినేటర్లను నియమించారు.

హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఇటుకబట్టీలు, గుడిసెలు వేసుకుని జీవించే సంచార జాతులు, భవన నిర్మాణాల్లో పనిచేసే వలస కూలీలు తదితర ప్రాంతాలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. ఇలాంటి 24 ప్రాంతాల్లో ప్రత్యేకంగా 24 మొబైల్ టీంలను ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కల మందు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. అదే విధంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేయడానికి 13 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటి వద్ద ప్రతీ పది నిమిషాలకు ఒకసారి మైక్‌ల ద్వారా చుక్కల మందు వేయించుకోవాలని చెప్పాలని అధికారులు పేర్కొన్నారు.

ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ సుందరగిరి శ్రీనివాసరావును డీజీపీ కార్యాలయానికి, ఆ స్థానానికి సిరిసిల్ల నుంచి ఆర్.భీంశర్మను బదిలీ చేశారు. అదేవిధంగా మామునూరు ఏసీపీ సి.సతీష్‌బాబును డీజీపీ కార్యాలయానికి, ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ నుంచి బి.తిరుపతిని నియమించారు. అదేవిధంగా బి.మల్లయ్యను వరంగల్ సీసీఎస్ నుంచి డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

దరఖాస్తుల స్వీకరణలో రసాభాస

- డీఎంహెచ్ఓ కార్యాలయ ఉద్యోగులను కొట్టిన అభ్యర్థుల బంధువులు
- గంటన్నరపాటు నిలిచిన అప్లికేషన్స్ స్వీకరణ ప్రక్రియ
- క్యూలైన్‌లో కౌంటర్ల వద్దకు పంపించిన పోలీసులు

గీసుకొండ : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిరుద్యోగ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ రసాభాసగా సాగింది. అభ్యర్థులు, వారి వెంట వచ్చిన బంధువులు చేసిన గొడవతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఒక దశలో అభ్యర్థుల బంధువులు సంయమనం కోల్పోయి డీఎంహెచ్ఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పర్వేజ్, అటెండర్ వీరయ్యను కొట్టారు. దీంతో ఉద్యోగులు గంటన్నరపాటు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. పోలీసుల రక్షణ లేకుంటే దరఖాస్తులు స్వీకరించలేమని స్పష్టం చేశారు. డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ పరిస్థితిని నగర పోలీస్ కమిషనర్, కలెక్టర్‌కు ఫోన్ ద్వారా వివరించారు. సీపీ ఆదేశాల మేరకు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, పోలీసు సిబ్బంది డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరుకున్నారు. దరఖాస్తుదారులను శాంతింపజేసి క్యూలైన్ ద్వారా కౌంటర్ల వద్దకు పంపించే ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించారు.



డీఎంహెచ్ఓ కార్యాలయానికి తరలివచ్చిన అభ్యర్థులు, వారి బంధువులు

36 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్..

ఎన్‌హెచ్ఎం కింద 36 పోస్టుల భర్తీకి ఇటీవల కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో ఎంఎల్‌హెచ్‌పీ 11, ఎపిడమాలజిస్టు 1, స్టాఫ్‌నర్సు 14, టీబీహెచ్‌వీ 1, డీఈఓ లేదా అకౌంటెంట్ 1, మెడికల్ ఆఫీసర్ (ఎఫ్‌టీ) 1, ఫార్మసిస్టు 2, ఫిజీషియన్ 1, మెడికల్ ఆఫీసర్ 3, సపోర్టు స్టాఫ్ 1 పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల ఒకటి నుంచి ఐదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అభ్యర్థులు ఎక్కువ మంది రావడంతో గొడవకు దారి తీసింది.

రేపు జాబ్‌మేళా

కాశిబుగ్గ సెంటర్ : వరంగల్ ములుగు రోడ్డులోని ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి తెలిపారు. దోసిలి ఆన్‌లైన్ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేసేందుకు 150 మంది డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

టికెట్ మాకే ఇవ్వండి

- హాట్ కేక్‌లా మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టికెట్
- గెలిచే అవకాశాలు ఎక్కువ ఉండటంతో పోటీ
- 47 మంది దరఖాస్తు
- ఢిల్లీలో పలువురి మకాం



సాక్షి, మహబూబాబాద్: ఆదివాసీలు, గిరిజనుల ఓట్లు ఎక్కువ... అందివచ్చిన రిజర్వేషన్, ఏడింటా ఆరు చోట్ల కాంగ్రెస్ గెలుపు, ఇన్ని అనుకూల పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడకవంటిదే. పార్టీ నుంచి టికెట్ తెచ్చుకుంటే చాలు పార్లమెంట్‌లో ప్రవేశించినట్టే కావడంతో మానుకోట పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు మీమంటే మీము సిద్ధమని, మాకంటే మాకే టికెట్ ఇవ్వాలని పోటీపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. 47 మంది అభ్యర్థులు టికెట్ కోరుతూ ఏఐసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా పలువురు ఢిల్లీలో మకాం వేసి టికెట్ సాధించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

అధిష్టానమే బలరాముడి బలం

మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి అనగానే ముందుగా గుర్తుకువచ్చేది కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్. 2009లో ఎంపీగా గెలిచిన ఆయన కేంద్రంలో మంత్రి పదవి కూడా చేపట్టారు. గిరిజన నాయకుడిగా సౌమ్యుడిగా పేరున్న ఆయన ఏఐసీసీలో సోనియాగాంధీ మొదలుకుని ఇతర పార్టీ పెద్దలతో మంచి సంబంధాలున్నాయి. ఈ పరిచయాలతో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా పోటీచేసేందుకు ప్రయత్నం చేశారు. పెద్దలు నచ్చజెప్పడంతో శాంతించిన ఆయన ఇప్పుడు ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

బెల్లయ్యకు కుల బలం కలిసొచ్చేనా..

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా ఉంటూనే, లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉండి లంబాడీలను ఏకం చేయడంలో కీలకపాత్ర పోషించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కాంగ్రెస్ పార్టీలో కీలకభూమిక పోషించారు. ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకుడిగా బెల్లయ్యనాయక్ ఎదిగారు. ఈ నేపథ్యంలోనే భారత్ జోడోయాత్రలో పాల్గొని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పరిచయం పెంచుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన బెల్లయ్య చివరి వరకు ప్రయత్నించి ఆగిపోయారు. అయితే అధిష్టానం ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి సిద్ధమైన ఆయనకు అధిష్టానం హామీ మేరకు టికెట్ వస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఒక వేళ టికెట్ రాకపోతే నామినేటెడ్ పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఢిల్లీలో మకాం వేసిన శోభన్‌బాబు

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన భుక్యా శోభన్‌బాబు కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బెంగళూరులో ఐఐఎస్‌లో మాస్టర్స్ డిగ్రీ, ఐఎస్‌బీ నుంచి ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పూర్తిచేశారు. ట్రైబల్ హబ్ వ్యవస్థాపకుడైన శోభన్‌బాబు జాతీయస్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు కాంగ్రెస్ పెద్దలతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాలను ఉపయోగించి ఎలాగైన టికెట్ తెచ్చుకోవాలని ఢిల్లీలో మకాం వేసి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శోభన్‌బాబుకు బంధువులు, మిత్రులు ఉన్నారు.

క్లుప్తంగా

రిపోర్టర్‌నంటూ వేధిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

ఆత్మకూరు: ఓ ప్రతిక రిపోర్టర్‌నంటూ అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందిని వేధిస్తున్న ఆకుల శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బోలోనిపల్లెకు చెందిన ఆకుల శ్రీనివాస్ అనే వ్యక్తి ఓ పీడీఎఫ్ పత్రికలో ఎడిటర్‌ను, రిపోర్టర్‌నుంటూ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. తనకు నగదు ఇవ్వకుంటే ఇబ్బందులకు గురిచేస్తానని వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, గూడెప్పాడ్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ పోరెడ్డి సునీత తమ పొలం వద్ద పనులకు వెళ్లగా ఫోటోలు తీసి వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, నసీమా, టీచర్లు దేవమ్మ, కరుణ, శ్రీవిద్య, వాణి, పుష్పలీల, పద్మావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

వరంగల్: ఆరేపల్లి గ్రామ శివారులోని ప్లాటును ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని పైడిపల్లికి చెందిన బుద్దే సురేశ్ ఫిర్యాదు మేరకు రాజునాయక్, రామకృష్ణ, క్రాంతి, పూర్ణచందర్‌పై కేసులు నమోదు చేసినట్లు ఏనుమాముల ఎస్‌ఐ రాజు తెలిపారు. ఆరెపల్లి సమీపం కొత్తపేటకు వెళ్లే దారిలో సర్వే నంబర్ 661లో గతేడాది రెండెకరాల 12 గుంటల భూమిని గుండపు రవీందర్, సురేశ్ తదితరులు కొన్నారు. ఈభూమిలో గత 29న ఎలాంటి పత్రాలు, అగ్రిమెంట్లు లేకుండా నలుగురు వ్యక్తులు పొక్లెనైర్‌తో గోతులు తీస్తుండగా.. భూమి హక్కుదారులు వెళ్లి వారిని ప్రశ్నించారు. తిప్పారపు సురేశ్ తన భూమిని అమ్ముతానని చెప్పి తమ దగ్గర రూ.2.50 లక్షలు తీసుకున్నాడని సమాధానం ఇచ్చారు. కొనుగోలుకు సంబంధించిన పత్రాలు చూపించాలని అడగ్గా.. బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వప్నం.. సాకారం

ప్రభుత్వ కొలువులు సాధించిన ఉమ్మడి జిల్లా వాసులు
- ఒకేసారి జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

ప్రభుత్వ కొలువు ప్రతీ ఒక్కరి స్వప్నం(కల). అయితే నిరంతరం శ్రమిస్తే తప్ప నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సాధ్యం కాదు. మహాయజ్ఞం చేయాల్సిందే. దీనికి కారణం వందల సంఖ్యలో ఉద్యోగాలు.. లక్షల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడడం. అయితే పకడ్బందీ ప్రణాళిక, కఠోర శ్రమ, నిరంతర సాధన ఉంటే లక్ష్యం చేరుకోవచ్చు. కొందరు ఈ కోవలోనే చదివి తమ స్వప్నం సాకారం చేసుకున్నారు. ఒక ఉద్యోగానికే కష్టపడుతున్న తరుణంలో అకుంఠిత దీక్షతో చదివి ఒకేసారి రెండు, మూడు, నాలుగు ఉద్యోగాలు పొందారు. ఇలా ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు, పురుషుల విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

మౌనికకు నాలుగు ఉద్యోగాలు



తొర్రూరు రూరల్: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఎనమాల మౌనిక.. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించింది. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. దీంతో మౌనికను తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు సన్మానించారు.

సునీతకు మూడు..



రేగొండ(కొత్తపల్లి గోరి): జయశంకర్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన సునీత మూడు ఉద్యోగాలు సాధించింది. జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. కాగా, సునీత తండ్రి సామల రాజిరెడ్డి ఆమె చిన్నప్పుడే మృతి చెందగా తల్లి లక్ష్మి కష్టపడి చదివించారు. ఆమె కష్టానికి ప్రతిఫలం దక్కింది. కాగా, సునీతను గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందించారు.

రైతు కూలీ బిడ్డకు రెండు ..



నెల్లికుదురు: రైతు కూలీ బిడ్డ కష్టపడి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన నిడిగంటి భిక్షం కుమారుడు సునీల్.. భౌతిక శాస్త్రం, జనరల్ సైన్స్‌లో రెండింటిలో టీజీటీ ఉద్యోగాలు సాధించాడు. దీంతో గ్రామస్తులు సునీల్‌ను అభినందించారు.

కష్టానికి దక్కిన ఫలం..



కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి తగరం మమత టీజీటీ ఉద్యోగం సాధించింది. మమత విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాల్లోనే జరిగింది. కాగా, నిరంతరం కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించిన మమతను గ్రామస్తులు అభినందించారు.

సుజాతకు మూడు..



కొత్తగూడ: మండలంలోని పోలారం గ్రామానికి చెందిన ఇర్ప సుజాత ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించింది. జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. కాగా, పరీక్షలకు నెల రోజుల ముందు తండ్రి ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అయినా కన్నీటిని దిగమింగుకుని పట్టుదలతో చదివి తన లక్ష్యం నెరవేర్చుకుంది.

నెరవేరిన కల..



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొంత కృష్ణ, జయమ్మ దంపతుల ఏకైక కుమార్తె స్వప్న టీజీటీ (ఇంగ్లిష్) ఉద్యోగానికి ఎంపికైంది. ప్రస్తుతం స్వప్న బయ్యారం కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది.

కిశోర్..తీన్‌మార్..

- మూడు ఉద్యోగాలకు ఎంపిక



హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన డాక్టర్ కిశోర్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఫిబ్రవరి 28న డిగ్రీ లెక్చరర్, 29న జూనియర్ లెక్చరర్‌తో పాటు ఈనెల 1వ తేదీన వెలువడిన ఫలితాల్లో టీజీటీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

రవీందర్‌కు మూడు ..



కమలాపూర్: మండలంలోని అంబాలకు చెందిన మెట్టుపల్లి రవీందర్ మూడు ఉద్యోగాలు సాధించాడు. మొగిలి–కనకలక్ష్మి దంపతుల చిన్న కుమారుడు రవీందర్ గురుకుల విద్యా సంస్థల్లో జేఎల్(జూనియర్ లెక్చరర్), పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించాడు. కాగా, రవీందర్ ప్రస్తుతం హుజూరాబాద్ కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పని చేస్తున్నాడు. రవీందర్‌ను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు, హుజూరాబాద్ కోర్టు న్యాయవాదులు అభినందించారు.

రాణించిన రమ్య..

- రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



విద్యారణ్యపురి : హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన పల్లేర్ల రమ్య రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. డిగ్రీ కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్ (డీఎల్), మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ కాలేజీలో లైబ్రేరియన్ పోస్టులు సాధించింది. అలాగే, పాలిటెక్నిక్ లైబ్రేరియన్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రేరియన్, గ్రూప్ ఫోర్త్ ఫలితాల్లోనూ ప్రతిభ చాటింది. అందులో కూడా ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయి. ఎంపిక జాబితా ప్రకటించాల్సి ఉంది. అయితే గురుకులా డిగ్రీ కళాశాలలోని కెమిస్ట్రీ లెక్చరర్ ఉద్యోగంలో చేరాలనే నిర్ణయించుకున్నట్లు రమ్య తండ్రి శంకరయ్య తెలిపారు.

ఓ వైపు చిన్నారి ఆలనాపాలన.. మరో వైపు ఉద్యోగ వేట..



తొర్రూరు రూరల్: తన ఏడాది పాప ఆలానాపాలన చూసుకుంటూనే మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన శిల్ప.. ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. పంజాల కుమారస్వామి, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తై శిల్పకు మూడేళ్ల క్రితం వివాహం చేశారు. రెండేళ్లలోనే పాపకు జన్మనిచ్చింది. బాధ్యతలు మీదపడినా పట్టు వదలకుండా కష్టపడి టీజీటీ ఉద్యోగం సాధించింది. కాగా, శిల్పను తల్లిదండ్రులు, భర్త, గ్రామస్తులు అభినందించారు.

ఉపాధి మేట్‌కు మూడు..



చెన్నారావుపేట : నేటి పోటీ ప్రపంచంలో ఒక్క ఉద్యోగం సాధించడమే కష్టతరంగా మారింది. మండలంలోని కాల్‌నాయక్ తండాకు చెందిన బాదావత్ చందూలాల్–టీప్లి కుమారుడు రవిలాల్ ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. జూనియర్ లెక్చరర్‌గా, పీజీటీ, టీజీటీగా ఉద్యోగాలు సాధించాడు. రవి చదువుకుంటూనే గ్రామంలో ఉపాధిహామీ పథకంలో మేట్‌గా పనిచేస్తున్నాడు. మూడు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

అన్న, చెల్లికి ఉద్యోగాలు..



మేర్గు రాజు

దుగ్గొండి : అన్న, చెల్లెలకు ఒకేసారి ఉద్యోగాలు రావడంతో కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన పాదిల సంధ్యారాణి పుట్టిల్లు ఆత్మకూరు మండల కేంద్రం. ఉప్పుల సుదర్శన్– సరోజన దంపతుల కూతురు సంధ్యారాణి రాయపర్తిలోని కేజీబీవీలో టీచర్‌గా పనిచేస్తూ టీజీటీకి ఎంపికైంది. ఈమె అన్న ఉప్పుల రాజేష్‌కుమార్ డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. కూతురు సంధ్యారాణి, కుమారుడు రాజేష్‌కుమార్ ఇద్దరికి ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో సుదర్శన్–సరోజన దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రేబల్లె గ్రామానికి చెందిన మేర్గు రాజు గురుకుల్ టీచర్‌గా ఎంపికయ్యాడు.

రమాదేవికి మూడు..



నెక్కొండ : మండలంలోని పనికర గ్రామానికి చెందిన మెండే రమాదేవి టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ (మ్యాథ్స్) ఉద్యోగాలు సాధించింది. పీజీటీలో రాష్ట్ర వ్యాప్తంగా 97వ ర్యాంకు, లెక్చరర్‌గా రాష్ట్ర వ్యాప్తంగా 152 ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు మెండె వెంకటమల్లు, తల్లి రాజ్యలక్ష్మి, భర్త అల్లాడి సంపత్ ప్రోత్సాహంతో మూడు ఉద్యోగాలు సాధించినట్లు రమాదేవి తెలిపింది. ఈమేరకు రమాదేవిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

కారు, బైక్ ఢీ..

- భద్రకాళి ఈఓకు గాయాలు
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలిలో కారు, బైక్

హన్మకొండ కల్చరల్ : రోడ్డు క్రాస్ చేస్తున్న కారును బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర, భద్రకాళి దేవస్థానం ఈఓతోపాటు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం భద్రకాళి దేవస్థానం నుంచి కాపువాడకు వెళ్లే దారిలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో జరగనున్న సమావేశానికి వరంగల్ భద్రకాళి దేవాలయ ఈఓ శేషభారతి తన కారులో కాపువాడ రోడ్డుమీదుగా కలెక్టరేట్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తున్న కారును కాపువాడ నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న హనుమకొండ సుధానగర్‌కు చెందిన నవీన్, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే, ఈఓ శేషభారతి, డ్రైవర్ స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరు యువకులను స్థానికులు హుటాహుటిన 108లో ఎంజీఎంకు తరలించగా.. ఈఓ శేషభారతి, డ్రైవర్‌ను గార్డియన్ ఆసుపత్రికి తరలించారు. ఈవిషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం శేషభారతి మట్టెవాడ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



రంజిత్ (ఫైల్)

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట శివారు జాతీయ రహదారిపై ఓ కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొమ్ములవంచకు చెందిన మైదం రాజు, నెక్కొండ మండలం అలంకానిపేటకు చెందిన కొమ్ము రంజిత్ (24) ప్రైవేటు పనులు చేసుకుంటూ మానుకోటలో ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరు ద్విచక్రవాహనంపై కొమ్ములవంచలోని మైదం రాజు ఇంటికి వెళ్తున్నారు. మర్రిమిట్ట శివారు ఎన్‌హెచ్‌పై కారు వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న రంజిత్ దుర్మరణం చెందాడు. రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

మూడో రోజు ఆదాయం రూ. 3.46 కోట్లు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీ లెక్కింపు కొనసాగుతోంది. మూడో రోజు రూ. 3,46,61,000 ఆదాయం లభించింది. శనివారం ఉదయం 112 ఐరన్ హుండీలను లెక్కించామని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. మొదటిరోజు, రెండో కలిపి లభించిన ఆదాయం రూ. 6,13,75,000 కాగా మూడో రోజు రూ. 3,46,61,000 లభించిందని తెలిపారు. మూడురోజుల నుంచి లెక్కిస్తున్న 317హుండీల్లోని రూ. 9,60,36,000 నగదును బ్యాంకులో జమ చేశామని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



భిక్షపతి (ఫైల్)

నెక్కొండ: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అప్పల్‌రావుపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మందపూరి భిక్షపతి (48) ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. అప్పు తీర్చడానికి పొలం విక్రయించాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం కూతురు వివాహం కోసం అప్పు చేశాడు. అయితే అప్పు ఎలా తీర్చాలని మదనపడేవాడు. ఈ క్రమంలో శనివారం గౌడ పరపతి సంఘంలో చిట్టీ డబ్బు చెల్లించాల్సి ఉంది. అయితే చిట్టీ కోసం ఎవరిని అడిగినా డబ్బు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

టోల్‌ప్లాజా పైనుంచి పడి యువకుడి మృతి



కల్యాణ్ (ఫైల్)

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని జవహర్‌నగర్ టోల్‌ప్లాజా పైనుంచి పడి సంగు కల్యాణ్ (26) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై చల్లా రాజు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ములుగు మండలం ఇంచెర్ల గ్రామానికి చెందిన కల్యాణ్ మూడేళ్ల నుంచి టోల్‌ప్లాజాలో టికెట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి టోల్‌ప్లాజా పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా కల్యాణ్ మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలపై నిర్బంధ చట్టాలు

- రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బీజేపీ
- తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హన్మకొండ: ప్రజలపై రాజ్యం నిర్బంధ చట్టాలు అమలు చేస్తోందని మానవ హక్కుల వేదిక నాయకుడు, తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా శ్రామిక దినం సందర్భంగా అజ్ఞాత మహిళ అమరుల స్మృతిలో విప్లవోద్యమంపై నిషేధం ఎత్తివేయాలనే డిమాండ్‌తో సభ నిర్వహించారు. ముందు అమరుల బంధు మిత్రుల కమిటీ ప్రతి నిధులు పతాకం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమకాలీన సమాజంలో దేశద్రోహం చట్టాల అవసరం ఏముందో పాలకులు సమాధానం చెప్పాలన్నారు. పాలన విధానాన్ని ప్రశ్నించే రచయితలు, మేధావులు, జర్నలిస్టులపై దారుణమైన 'ఉపా' లాంటి చట్టాలను ప్రయోగించడం సరికాదన్నారు. బీజేపీ.. రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందన్నారు. మనుస్మృతి పేరుతో విష సంస్కృతి రుద్దుతోందన్నారు. అనంతరం అజ్ఞాత రచయితల 'వియుక్క' కథల పుస్తకాలను హరగోపాల్, అమర వీరుల కుటుంబసభ్యులు ఆవిష్కరించగా ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే పుస్తక పరిచయం చేశారు. ఈ సభలో అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి పస్మ కుమారి, వియ్యక్క పుస్తకాల సంపాదకురాలు బి.అనురాధ, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌తో సానుకూల చర్చలు

రాష్ట్రంలో 'ఉపా' చట్టం అమలుపై సమీక్షించి పునః పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించినట్లు తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్ చెప్పారు. ఈమేరకు శనివారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1వతేదీన సీఎం రేవంత్ రెడ్డిని 20 మంది తెలంగాణ, ప్రజాస్వామ్యవాదులం కలిశామన్నారు. దేశంలో తెలంగాణలోనే 'ఉపా'చట్టాన్ని అధికంగా వినియోగించారని, 250 మందికి పైగా ప్రయోగించారన్నారు. చట్టం ప్రయోగించడమంటే శిక్షణ మొదలైనట్లేనన్నారు. దీనిని పరిశీలించాలని సీఎంకు సూచించామన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, హక్కులపై దాడి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కోరామన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇతర పథకాలు అమలు చేయాలని చెప్పామని వివరించారు. ఆయనవెంట ఫ్రంట్ ప్రతినిధులు కూరపాటి వెంకటనారాయణ, కె.రవిచందర్ ఉన్నారు.

హోటల్ హరిత కాకతీయలో మంటలు



హరిత హోటల్‌లో ఎగసిపడుతున్న మంటలు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. శనివారం హోటల్‌లోని కిచెన్ రూమ్‌లో పొగ గొట్టాలు శుభ్రం చేస్తుండగా.. ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. పొగ గొట్టాలు చమురు (ఆయిల్)తో నిండి ఉండడంతో మంటలు విస్తరించాయి. అక్కడే ఉన్న హోటల్ సిబ్బంది మంటలు ఆర్పారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. కానీ అప్పటికే మంటలు అదుపులోకి వచ్చాయి. దట్టమైన పొగ వస్తుండడంతో చుట్టుపక్కల వారు ఏం జరుగుతుందోనని భయపడ్డారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పెద్దగా నష్టం జరగలేదు.

భీమా సందడి





గోపిచంద్‌తో కరచాలనం చేస్తున్న అభిమానులు,పద్మశ్రీ సమ్మయ్యతో కరచాలనం చేస్తున్న గోపిచంద్

హన్మకొండ చౌరస్తా: వరంగల్ నగరంలో శనివారం రాత్రి భీమా టీమ్ సందడి చేసింది. స్థానిక కేడీసీ మైదానంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోపిచంద్, మాళవిక శర్మలను చూసి అభిమానులు కేరింతలు కొట్టారు. గోపీచంద్ మాట్లాడుతూ అప్పట్లో వర్షం సినిమాలో భద్రన్నగా తనను ఎంతో ఆదరించారు.. ఇప్పుడు భీమాగా ముందుకు రాబోతున్న తరుణంలో మీరు చూపిన ప్రేమకు ధన్యవాదాలన్నారు. సినీ నిర్మాత రాధామోహన్ మాట్లాడుతూ తాను ఆర్‌ఈసీలో ఐదేళ్లు చదువుకున్నానని, ఇది నా సొంతూరు అని తెలిపారు. సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సత్కరించారు. సుమ యాంకర్‌గా వ్యవహరించారు. సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి ఎ.హర్ష దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో మంత్రి ధనసరి సీతక్క పాల్గొన్నారు.